క్లుప్తంగా

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన రాష్ట్ర బృందం



బాగువలస పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డా.మిథాలి బృందం

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని డా.మిథాలి రాష్ట్ర బృందం మంగళవారం సందర్శించింది. ఆస్పత్రికి వచ్చిన వారు అక్కడ అందుతున్న సౌకర్యాలు, సదుపాయాలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారికి అందిస్తున్న మందులు తదితర అంశాలను పరిశీలించారు. స్థానిక టీబీ యూనిట్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. స్థానిక వాతావరణం, ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం మండలంలో బాగువలస పీహెచ్‌సీని పరిశీలించారు. వారి వెంట సూపరింటెండెంట్ డా.రత్నకుమారి, డా వేణు, నరేష్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న పలువురు నాయకులు

సాలూరు: మండలంలోని జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీని తెరవాలని కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజు మంగళవారం దీక్షా శిబిరాన్ని పలు రాజకీయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు సందర్శించి తమ సంఘీభావం తెలిపారు. గత 13 నెలలుగా ఫ్యాక్టరీ మూసి వేయడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ఫ్యాక్టరీ తెరవాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



సీసీ రోడ్డు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని 29వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం భూమిపూజ చేశారు. దాదాపు రూ.7.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే దృష్టికి ఆ సమస్యలను స్థానికులు తీసుకురాగా, స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరయ్యేలా చొరవ చూపి, ఇప్పుడు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్ చెలికాని మురళి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే



కుమ్మరిపేట కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట గ్రామ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం సందర్శించారు. అక్కడి పరిసరాలు పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థుల చదువు, ఆరోగ్యం వహిస్తున్న శ్రద్ధపై ఎమ్మెల్యే ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని, అలాగే వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో శంబంగి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా జాతీయ క్రీడల దినోత్సవం



వివిధ వేషధారణలలో విద్యార్థులు



దుర్గాదేవి అలంకరణలో నిడగల్లు విద్యార్థిని

సీతానగరం: తెలుగు భాష, జాతీయక్రీడల దినోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని నిడగల్లు, సీతానగరం ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు మంగళవారం కార్యక్రమాలు నిర్వహించారు. నిడగల్లులో హెచ్‌ఎం ఎం శివున్నాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులతో నృత్యప్రదర్శనలు, అమ్మవారి కళారూపాలు, క్రీడా, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే సీతానగరం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు అల్లక జగన్నాథరావు ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు పైడ్రాజు మాస్టారు, లక్ష్మీ సుభద్రమ్మ పర్యవేక్షణలో క్విజ్, డిబేట్, వ్యాసరచన, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు మాట్లాడుతూ వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు భాషాభివృద్ధికి చేసిన సేవలను, హాకీ క్రీడ ద్వారా భారత కీర్తి పతాకాన్ని నలుదిశలా చాటిన ధ్యాన్‌చంద్ కృషిని ప్రస్తుతించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష దినోత్సవం

మక్కువ: మండలంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల, కళాశాలలో తెలుగు భాష దినోత్సవం, గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అధ్యాపకురాలు ఎస్.స్వర్ణలత తెలుగు భాష దినోత్సవం, గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన కృషిని వివరించారు. అనంతరం విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో



వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్దనివాళులర్పించిన ఉపాధ్యాయులు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు

పాటు పద్యపఠనం, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్వతి, పి.పద్మ ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో కీర్తి

పార్వతీపురంటౌన్: క్రీడలతో కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రతిభా పురస్కారాలు ప్రదాన ఉత్సవం పార్వతీపురంలోని ఆర్‌సీఎం ప్రాంగణంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ గొప్ప హాకీ క్రీడాకారుడని, ఒలింపిక్ స్వర్ణ పతకాలను అందించిన భారత ముద్దు బిడ్డ అని కొనియాడారు. క్రీడలలో విద్యార్థులు ముందంజ వేయాలని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభా పాటవాలు చూపాలని పిలుపునిచ్చారు. క్రీడలతో మంచి గుర్తింపు లభిస్తుందని, క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు సైతం ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. అనంతరం క్రీడా ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, వ్యాయమ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్‌డీటీ రమేష్‌బాబు

సీతానగరం: ప్రభుత్వం సమకూరుస్తున్న రేషన్ సరుకులను డీలర్లు సకాలంలో జగనన్న రేషన్ పంపిణీ వాహనాల ద్వారా వినియోగదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు మంగళ వారం సీఎస్‌డీటీ రమేష్‌బాబు అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో రేషన్ డిపోడీలర్లు, జగనన్న రేషన్ పంపిణీ వాహన యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్వీ రమణ మాట్లాడుతూ జీజీఎంపీ గ్రామసభలు, జగనన్న సురక్ష గ్రామసభల్లో వచ్చిన అర్హులైన వారికి రైస్ కార్డులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. పాతరేషన్ కార్డులతో పాటు కొత్తగా ప్రభుత్వం మంజూరుచేసిన రేషన్ కార్డుల లబ్ధిదారులకు ఎలాట్‌మెంట్ చేసిన సరుకులను నిర్దేశించిన గడువులోగా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో సీఎస్‌డీటీ రమేష్‌బాబు మాట్లాడుతూ రేషన్ డిపో డీలర్లు రేషన్‌కార్డులున్న 16,768 మంది లబ్ధిదారులు, అంగన్వాడీ కేంద్రాలకు సకాలంలో సరుకులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, డీలర్లు పాల్గొన్నారు.

ఒప్పందం ప్రకారమే సర్పంచ్ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న సర్పంచ్ బి.భాస్కరరావు

సీతానగరం: మండలంలోని రంగంపేట పంచాయతీ గ్రామపెద్దల ఎదుట కుదిరిన ఒప్పందానికి కట్టుబడి ఉంటానని సర్పంచ్ బి.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో రెండు వర్గాలున్నా గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ ఎన్నిక వివాదాలకు తావివ్వకూడదన్న నిర్ణయంతో గ్రామ పెద్దలు పంచాయతీని యునానిమస్ చేయాలని అప్పట్లో నిర్ణయించారన్నారు. జెంటిల్‌మెన్ అగ్రిమెంట్ మేరకు రెండు సంవత్సరాల తన పదవీకాలం ముగియ డంతో రెండో వ్యక్తికి సర్పంచ్ పదవి ఇవ్వాలనే సంకల్పంతో తాను రాజీనామా చేస్తున్నట్లు తెలియజేశారు. తనకు సర్పంచ్ పదవి రావడానికి కారకులైన ఎమ్మెల్యే అలజంగి జోగారావు, గ్రామ పెద్దలను గౌరవిస్తూ పదవికి రాజీనామా పత్రాన్ని పాలకవర్గ సభ్యుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి రోహిణికి సమర్పించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రోహిణి మాట్లాడుతూ భాస్కరరావు సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పత్రం ఇచ్చారని ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆమోదించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు వై.వెంకటరమణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ కార్యదర్శి కామే శ్వరరావు, సచివాలయ ఉద్యోగులు ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ కూడా..

అలాగే రంగంపేట పంచాయతీ ఉపసర్పంచ్ మరడ సత్యనారాయణ కూడా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లు వేర్వేరు ఫార్మాట్లలో రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రోహిణి, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘం జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు తండ్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గొర్లి శంకరరావును ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్య కారణంగా ఆయన విశాఖపట్నంలో శస్త్రచికిత్స చేసుకున్నారు. ఈ సందర్భంగా సౌందర్య నారాయణ మూర్తి కాలనీలో గల ఆయన నివాసానికి ఎమ్మెల్యే జోగారావు వెళ్లి పరామర్శించారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, ఏఎంసీ డైరెక్టర్ అలజంగి జితేంద్ర, కాలనీ పెద్దలు జల్లు వినయ్, పశుమర్తి వెంకట ప్రసాద్, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.



గొర్లి శంకరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్తంభాల మార్పుతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

లెస్సన్ ప్లాన్‌ల పంపిణీ

రామభద్రపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు చేతులమీదుగా లెస్సన్ ప్లాన్‌లు మంగళవారం పంపిణీ చేశారు. వీటిని(లెస్సన్ ప్లాన్‌లు)విశాఖపట్నం, విజయనగరం జిల్లాల అంబుడ్స్‌మన్ అధికారి, సీడీసీ స్వచ్ఛంద సంస్థ అధినేత శతపతి అన్నపూర్ణమ్మ తన సొంత నిధులతో రూపొందించారని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్న సదుద్దేశ్యంతో ఆమె చేసిన ఈ ప్రయత్నం అభినందనీయమని ఎంపీపీ అన్నారు. ఉపాధ్యాయులు కూడా చదువులో బాగా వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం కూడా విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని, ప్రభుత్వ నిధులు వృథా కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పెంటయ్య, రామభద్రపురం, కొట్టక్కి హెచ్‌ఎంలు కె. కామేశ్వరరావు, ఆర్.భాస్కరరావు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి

రేగిడి: ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులంతా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని ఉనుకూరులో మీడియాతో మాట్లాడిన ఆయన జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగు బాగుందని, ప్రభుత్వం సకాలంలో అన్నిరకాల విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడంతో రైతులకు వ్యవసాయం సులభతరమైందన్నారు. జిల్లాలో ఎక్కువగా సాగులో ఉన్న వరి పంటకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఊపిరి పోస్తున్నాయన్నారు. అయితే అక్కడక్కడ వరి పంటకు పట్టిన తెగుళ్లకు రసాయనిక ఎరువులు అతిగా వాడడమే కారణమని, వీటి వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏవో జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన నిర్వహించగా గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పురపాలక సంఘం పరిధిలో నిర్వహించ తలపెట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే అన్ని వార్డులలో పారిశుద్ధ్య, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పురపాలక యంత్రాంగం వచ్చే సెప్టెంబర్ నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, పూర్తి స్థాయిలో అన్ని కాలువలు శుభ్రం చేస్తుందని సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే బదులిచ్చారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు, ఫ్లోర్ లీడర్, పలువురు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని నర్సిపురం పంచాయతీ ఓలేటి ఫామ్ బాలాజీ లేఔట్ కాలనీలో రహదారి, కాలువల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్ చెరుకుబిల్లి బంగారమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు, సీనియర్ నాయకులు, కాలనీ పెద్దలు, స్థానిక ఉపాధ్యాయులు, పంచాయతీ మెంబర్లు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలి

పార్వతీపురంటౌన్: విద్యార్థుల్లో రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఆయన మండలంలోని ఎమ్మార్‌నగరం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను మంగళవారం సందర్శించారు. ఇప్పటి వరకు ఎంతమంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించారు, ఎంత మందిని రక్త హీనత ఉన్నవారిగా గుర్తించారని సిబ్బందిని ఈ సందర్భంగా ఆరా తీశారు. విద్యార్థుల హిమోగ్లోబిన్ శాతం నమోదు రికార్డులు పరిశీలించి తక్కువగా ఉన్న విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిశీలన చేశారు. అందుకు కారణమైన అంశాలపై ఆరా తీసి తగు సూచనలు చేశారు. ప్రతి రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు పౌష్టికాహారం బాగా తీసుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహన్‌రావు విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కల్పించి రక్తహీనత లక్షణాలు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.విజయకుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.హరికృష్ణ, సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్‌ఎం పోలమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



హిమోగ్లోబిన్ రక్త పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలి

- జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ లాండ్ రికార్డ్స్' అండ్ సర్వేలో(ఎఫ్‌పీఓఆర్ఎల్)భాగంగా చేపడుతున్న ఆన్‌లైన్ డేటా ఎంట్రీలో ఎటువంటి తప్పులు ఉండరాదని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం డివిజన్ తహసీల్దార్‌లు, ఉప తహసీల్దార్‌లు, రీసర్వే డీటీలు, మండల సర్వేయర్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఆర్‌డీఓ కార్యాలయంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటాను తప్పుగా ఎంట్రీచేస్తే వీఆర్‌ఓ నుంచి తహసీల్దార్ వరకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. తప్పులు లేని రికార్డుల తయారీలో మన భాగస్వామ్యం ఉండడం గర్వకారణంగా భావించాలని పేర్కొన్నారు. రీసర్వేలో ఉన్న అన్ని అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. రీసర్వేలో జిల్లా ఆదర్శంగా నిలవాలని అందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలని కోరారు. శిక్షణలో ఆర్‌డీఓ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

అత్యవసర సేవల్లో ముందుండాలి

పార్వతీపురంటౌన్: అత్యవసర సేవలు అందించడంలో ముందుండాలని 108 వాహనాల అన్‌జాబ్ ట్రైనర్ అలుబిల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఆవరణలో 108లో పనిచేస్తున్న ఈఎంటీ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 వాహనంలో ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ ఇచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. దానిలో భాగంగా 108లో పనిచేస్తున్న ఈఎంటీ సిబ్బందికి నూతన కార్డియాక్ వాస్కులర్(హృద్రోగాలు) ఎమర్జెన్సీలో ఎలా రక్షణ కల్పించాలనే అంశాల గురించి శిక్షణ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ మన్మథనాయుడు, ఈఓ గిరిబాబు, డివిజన్ నుంచి 42 మంది ఈఎంటీలు పాల్గొన్నారు.



ఈఎంటీలకు శిక్షణ అందజేస్తున్న జాబ్ ట్రైనర్ అలుబిల్లి శ్రీనివాసరావు

లచ్చయ్యపేటలో పారిశుద్ధ్య పనులు

సీతానగరం:

మండలంలోని లచ్చయ్యపేటలో ప్రధాన కూడలి, రాష్ట్ర రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తకుప్పలను సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మురళి మంగళవారం జేసీబీతో తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి మురళి మాట్లాడుతూ లచ్చయ్యపేట పంచాయతీలోని గుమ్మిడివరంలో పారిశుద్ధ్య పనులు చేయించామని, అలాగే రాష్ట్ర రహదారిలో లచ్చయ్యపేటలో రోడ్డుకు ఇరుపైపులా ఉన్న చెత్త కుప్పలను తొలగించడంతో పాటు ప్రధాన వీధిలో పారిశుద్ధ్య పనులు చేయించినట్లు తెలిపారు. రోడ్డు పక్కనే ఉన్న పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగించి చెత్తకుప్పలను దూరప్రాంతానికి తరలించినట్లు తెలియజేశారు. ఇంటింటి కుళాయి పనులు గ్రామంలో జరుగుతున్నాయని, ఓవర్ హెడ్‌ట్యాంక్ పనులు పూర్తి కావచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.



ప్రధాన వీధిలో జేసీబీతో చెత్తను తీయిస్తున్న కార్యదర్శి మురళి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

రామభద్రపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తం కావాలని ఎంపీడీవో రమామణి సూచించారు. మండలంలోని బూసాయవలస, జమ్ముపలస గ్రామాల్లో పలువురికి మలేరియా వ్యాధి సోకినట్లు నిర్ధారణ కాగా, అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖాధికారులు, సచివాలయ కార్యదర్శులతో కలిసి ఆయా గ్రామాల్లో దోమల మందు పిచికారీ మంగళవారం చేయించారు. ఆమె మాట్లాడుతూ ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఖాళీ ప్రదేశాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. తాగునీటి బోరుబావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరికతోట మలేరియా యూనిట్ అధికారి మల్లిఖార్జునరావు, బూసాయవలస సచివాలయం కార్యదర్శి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.



బూసాయవలసలో దోమలమందు పిచికారీ చేయిస్తున్న అధికారులు